సాక్షి
వికారాబాద్

బుధవారం । 15 । మార్చి । 2023



నిరుపయోగంగా నీటితొట్లు

పశువులు దాహార్తిని తీర్చేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. 8లో▸



మూడెకరాల భూమి ఏమాయె

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మూడెకరాల భూ పంపిణీ హామీ ఏమైందని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రశ్నించారు. 8లో▸



ఎన్‌ఎంఎంఎస్‌తో నష్టమే..

ఉపాధి హామీ కూలీలకు అమలు చేస్తున్న ఆన్‌లైన్ హాజరు ద్వారా సిగ్నల్స్ లేని పలుచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

పన్ను చెల్లింపునకు సహకరించండి



ఇంటి పన్ను సేకరిస్తున్న కమిషనర్

వికారాబాద్ అర్బన్: సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. స్థానిక సమస్యలపై ఆరా తీస్తూనే పన్ను వసూలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు పన్ను చెల్లిస్తేనే అన్ని సేవలు అందించడానికి వీలుంటుందని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ శివకుమార్ ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న శుభప్రద్ పటేల్, మైనార్టీ నాయకులు

యాలాల: బండమీదిపల్లి శివారులోని జలాలుద్దీన్ సాహెబ్ దర్గా ఉత్సవాలు మతసామరస్యాన్ని చాటిచెప్పేలా నిర్వహించడం అభినందనీయమని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఉర్సు వేడుకల్లో భాగంగా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు ప్రజలు సభిక్షంగా ఉండాలని, వ్యవసాయ రంగంలో పురోగమించాలని మొక్కుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ సర్వమతాలకు సమప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అనంతరం దర్గా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంచంద్రమ్మ లక్ష్మయ్య, అబిద్ చౌహాన్, రహ్మాన్, శుభప్రద్ యువసేన సభ్యులు భానుప్రసాద్, కుర్వ బాలు, హరీశ్, శ్రీశైలం, అంజి తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ



విశ్వనాథ్‌పూర్ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

యాలాల: జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన క్యాంపును ఆయన తనిఖీ చేశారు. అనంతరం యాలాల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. కంటి వెలుగు విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తున్నామని, ఆపరేషన్ల కోసం నగరానికి రిఫర్ చేస్తున్నామని స్పష్టంచేశారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందులను పరీక్షించారు. వైద్య సిబ్బంది, ఆస్పత్రిలో అందుతున్న సేవలపై వైద్యాధికారి అనూషను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ వసంత, పవిత్ర, ఫార్మసిస్ట్ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా 'మహిళా మారథాన్'

మీర్‌పేట: మహిళా వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో 'మహిళా మారథాన్' ఉత్సాహంగా సాగింది. మీర్‌పేటలోని బురుజు నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, మహిళా కార్పొరేటర్లు, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన రంగవల్లులు, క్రీడలు, ఆటలు, వంటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మేయర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్ఓ అంజన్ రెడ్డి, కార్పొరేటర్లు అక్కి మాధవి, ధరంకార్ జ్యోతి, తీగల మాధవి, కీసర గోవర్ధన్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, ముత్తంగి కరుణానిధి, గౌరీశంకర్, భీంరాజ్, ఇంద్రావత్ రవినాయక్ పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్

ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా మంగళవారం వైద్య, ఆర్టీసీ, పోలీస్, మున్సిపల్, తపాలా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధవారంనుంచి ప్రారంభమయ్యే పరీక్షల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సహకరించాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

- హాజరు కానున్న 17,888 మంది విద్యార్థులు
- జిల్లావ్యాప్తంగా 30 సెంటర్లు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



వికారాబాద్ అర్బన్: ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 30 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో 15 ప్రైవేటు, 9 ప్రభుత్వ జూనియర్, 6 రెసిడెన్షియల్ కళాశాలలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 35 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డీఓలు విధులు నిర్వహించనున్నారు. వీరితో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ టీంలు తనిఖీలు నిర్వహిస్తాయి.

కేంద్రాల్లో వసతుల కల్పన

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన 17,888 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఫస్టియర్ జనరల్ స్టూడెంట్స్ 7,857 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,374 మంది, సెకండియర్‌లో 7,440 మంది జనరల్, 1,217 మంది ఒకేషనల్ స్టూడెంట్స్ పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికోసం మొత్తం 30 సెంటర్లలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటిలో వికారాబాద్‌లో 9, తాండూరు 8, పరిగి 5, కుల్కచర్ల 2, కొడంగల్ 1, పెద్దేముల్ 1, మర్పల్లి 1, నవాబుపేట్ 1, మోమిన్‌పేట్ 1, దోమలో- 1 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించారు.

సీసీ కెమెరాల నిఘాలో..

పరీక్ష పేపర్ల సీల్ తీయడం, బవాబు పత్రాలకు సీల్ వేయడం వంటివి పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఉన్న ప్రైవేటు కళాశాలలకే సెంటర్లను కేటాయించారు. ప్రభుత్వ కాలేజీల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎగ్జామ్స్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో ఒక సీనియర్ ప్రిన్సిపాల్, ఒక ఏఎస్ఐ, డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు.

సెంటర్ లొకేషన్ యాప్

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అడ్రస్ తేలికగా దొరికేలా సెంటర్ లొకేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటివరకు ఎంసెట్ పరీక్షల కోసం ఈ పద్ధతిని వినియోగించారు. దీని ద్వారా విద్యార్థులు తికమక లేకుండా నేరుగా పరీక్ష కేంద్రానికి చేరుకునే వీలుంటుంది. డీఐఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ కూడా ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే 9963356062ను సంప్రదించవచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను నేరుగా వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

అరగంట ముందే లోనికి అనుమతి

పరీక్షకు వచ్చే విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అరగంట ముందానే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా 8:30 నుంచే ఎగ్జామ్ హాల్‌లోకి పంపిస్తారు.

ఫస్ట్ క్లాస్ సాధిస్తా



ఈ ఏడాది ప్రిపరేషన్‌కు మంచి సమయం దొరికింది. ఫస్ట్ క్లాసు మార్కులు సాధిస్తాననే నమ్మకంతో ఉన్నా. గతేడాది ఫస్టియర్ పరీక్షలు రాసినందున ప్రస్తుతం పెద్దగా ఒత్తిడి లేదు. అధ్యాపకుల సూచన మేరకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం.

– దీన, ఎంఈసీ సెకండియర్, ఏసీఆర్ భృంగీ కళాశాల

ఒత్తిడి లేదు



ఈరోజు నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇందుకోసం మానసికంగా సిద్ధమయ్యాం. ఎలాంటి ఒత్తిడి లేదు. కాలేజీలో నిర్వహించిన అన్ని పరీక్షలకు హాజరయ్యాం. దీంతో టెన్షన్ ఏమీ లేదు. మంచి మార్కులు సాధించేందుకు ప్రయత్నిస్తా.

– ఆకాశ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికారాబాద్

ఆత్మవిశ్వాసంతో రాయాలి



ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. ఆయా రూట్లలో రైల్వే గేట్లు ఉన్నందున గంట ముందే సెంటర్లకు చేరుకోవడం మంచిది. జవాబు బాగా వచ్చిన ప్రశ్నలను ఎంచుకుని రాయాలి. ఒకటి రెండు సబ్జెక్టుల్లో తప్పినా.. వెంటనే సప్లిమెంటరీ ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు.

– శంకర్, ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి

69 జీఓపై నిర్లక్ష్యం తగదు



రావులపల్లిలో సంతకాలు సేకరిస్తున్న జల సాధన సమితి నాయకుడు నర్సింహ

- నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి
- జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ నర్సింహ
- రావులపల్లిలో సంతకాల సేకరణ

కొడంగల్ రూరల్: నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలని జిల్లా జల సాధన సమితి కో కన్వీనర్ హెచ్.నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిధిలోని రావులపల్లిలో మంగళవారం రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాల జాబితాతోపాటు రైతులు రాసిన లేఖలను పోస్టు ద్వారా ముఖ్యమంత్రి, గవర్నర్, కేంద్ర జలశక్తి మంత్రి పంపించారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ.. పది మండలాల్లో సంతకాలు సేకరించామని తెలిపారు. ఉమ్మడి ఏపీలో అప్పటి గవర్నర్ జారీ చేసిన జీఓ 69ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది అమలై ఉంటే ఈప్రాంతమంతా పాడిపంటలతో కళకళలాడేదని తెలిపారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా జూరాల ప్రాజెక్టులోని 7.10 టీఎంసీలతో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని 69జీఓ అమలుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశన్న, కాశప్ప, రాములు, లక్ష్మణ్ణ, సిద్దేశ్వర్, వెంకటయ్యగౌడ్, బుచ్చప్ప, భీమమ్మ, కనకమ్మ, అంజిలమ్మ, లలితమ్మ, బసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

అనంతగిరి: గురుకుల పాఠశాల 5వ తరగతిలో ప్రవేశాలకు గురువారం వరకు గడువు పొడిగించినట్లు జిల్లా సమన్వయాధికారి పి.అపర్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం గత నెల 8న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఆమె తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సొంతింటి కలను నెరవేర్చుకోండి

- 17, 18న రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం
- ఓపెన్ ప్లాట్ గజం ధర రూ.7,500
- వివరాలు వెల్లడించిన ఆర్డీఓ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌కుమార్

తాండూరు రూరల్: యాలాల మండలం కోకట్ శివారులోని మనోహర టౌన్‌షిప్‌లో రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు ఈనెల 17, 18 తేదీల్లో వేలంపాట నిర్వహించనున్నట్లు తాండూరు ఆర్డీఓ అశోక్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రీ బిడ్డింగ్ రెండో విడత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 14 ఓపెన్ ప్లాట్లు, వివిధ దశల్లో ఉన్న 54 ఇంటి నిర్మాణాలకు కలెక్టర్ ఆదేశంతో వేలం వేస్తున్నామని తెలిపారు. ఇందులో పాల్గొనే వారు రూ.10 వేలు ముందస్తుగా డిపాజిట్ చేయాలని సూచించారు. కొనుగోలుదారుల ఆసక్తి మేరకు ఓపెన్ ప్లాట్ చదరపు గజానికి రూ.7,500 ధర నిర్ణయించామన్నారు. పలు దశల్లో ఆగిపోయిన నిర్మాణాలను సైతం వేలం వేస్తామని, కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. తక్కువ ధరకే లభించే ప్లాట్లను కొనుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ చిన్నప్పల నాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, రాజీవ్ స్వగృహ సిబ్బంది వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



కాగ్నా నదిలో ఇసుక మేటలు

'కాగ్నా' లూటీ

కాగ్నాలో ఇసుక దోపిడీకి అడ్డులేకుండా పోతోంది. నదిలోని సహజ సంపదను అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ఓ వైపు నుంచి కర్ణాటక వాసులు, మరోవైపు నుంచి అధికార పార్టీ నేతలు దర్జాగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా కాగ్నా దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. కళ్ల ముందే ఈ వ్యవహారం సాగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారు.

- నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- అనుమతుల చాటున అధికార పార్టీ నేతల దందా?
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు



ఇసుక తరలిస్తూ పట్టుపడిన ట్రాక్టర్

బషీరాబాద్: మండలంలోని నది పరీవాహక గ్రామాలైన క్యాద్గీరా, నావంద్గీ, ఇందర్‌చెడ్‌లో కాగ్నా ప్రవహిస్తోంది. నదికి అవతలి వైపున కర్ణాటక రాష్ట్రం చించోళి తాలుకా పరిధిలోని పోతంగల్, హల్కోడ సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. నదిలో సగ భాగం తెలంగాణ, సగ భాగం కన్నడ ప్రభుత్వానికి వచ్చేలా గతంలోనే ఇరు ప్రభుత్వాలు సరిహద్దులు గుర్తించాయి. ఎవరైనా సరిహద్దులు అతిక్రమించి ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని రెండు ప్రభుత్వాల తరఫున 2018లో కలెక్టర్ల బృందం నిర్ణయించింది. కర్ణాటకలోని గ్రామాల అక్రమార్కులు హల్కోడ, పోతంగల్ గ్రామాల పరిధిలోని సర్వే నంబర్ 72, 74లో ఇసుక అక్రమంగా తవ్వకాలు చేపట్టి రవాణా చేస్తున్నారు. సెలవు రోజులను ఎంచుకుని హిటాచీలు, టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారు. రాత్రి తవ్విన ఇసుకను కర్ణాటక భూభాగంలో నిల్వ చేసి పగటి వేళల్లో అక్కడి నుంచి డంప్ చేస్తున్నారు.

సీసీ రోడ్లకు అక్రమంగా..

బషీరాబాద్ మండలంలో ఉపాధిహామీ పథకం కింద సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం కాగ్నా నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్లను సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సీసీ రోడ్ల కోసం ఒక ట్రాక్టర్‌కు తహసీల్దార్ పేరున రూ.1,800 డీడీ చెల్లించి అనుమతి తీసుకోవాలి. అయితే డీడీ చెల్లించడంతో పాటు ట్రాక్టర్ కిరాయి, లేబర్ చార్జీలు ఎక్కువవుతాయని అధికార పార్టీకి చెందిన నేతలు యంత్రాల సాయంతో అక్రమంగా రాత్రి వేళల్లో ఇసుక రవాణా చేసుకుంటున్నారు. 10 ట్రాక్టర్లకు అనుమతి తీసుకుని 20 ట్రాక్టర్లు తరలిస్తున్నారు. ఇందర్‌చెడ్‌కు చెందిన అధికార పార్టీ నాయకుడు నిత్యం ఇదే దందా చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసినా పోలీసు, రెవెన్యూ అధికారులు అతనిపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారు. ఎక్మాయి, మంతట్టి, రెడ్డిఘనాపూర్, కంసాన్‌పల్లి, బషీరాబాద్, నావంద్గీ, జీవన్గీ, క్యాద్గీరా, గంగ్వార్ గ్రామాల్లో అక్రమంగా రోజు ఇసుక రవాణా జరుగుతోంది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు.

కేసులు పెడ్తాం

అనుమతులకు మించి ఇసుక రవాణా చేస్తే పోలీసు కేసులు నమోదు చేస్తాం. రాత్రి వేళల్లో ఇసుక రవాణాకు అనుమతులు లేవు. కొందరు అనుమతుల లెటర్స్ చూపిస్తూ రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 40 ట్రాక్టర్లకు మాత్రమే పర్మిషన్ ఇచ్చాం. అనుమతులు లేని రెండు ట్రాక్టర్లను ఈ మధ్యే సీజ్ చేశాం.

– వెంకటస్వామి, తహసీల్దార్

హృదయాన్ని తట్టి లేపుదాం..

ఇటీవలి కాలంలో సంభవిస్తున్న గుండెపోటు మరణాలు అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కరోనా తర్వాత కాస్త కోలుకున్న జనం ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులతో కలవరానికి గురవుతున్నారు. హార్ట్‌ఎటాక్‌లను చూసి జడుసుకుంటున్నారు. కూర్చున్న వారు కూర్చున్న చోటే ప్రాణాలు వదిలేయడం ఆందోళన కలిగిస్తోంది.

- సర్వత్రా ఆందోళన కలిగిస్తున్న గుండెపోట్లు
- రోజురోజుకూ పెరుగుతున్న మరణాలు
- సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని వైద్యుల సూచన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

వికారాబాద్ అర్బన్: గుండెపోటుపై జనాల్లో అనేక రకాలుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ తమ హృదయం పదిలమేనా..? అని భయపడుతున్నారు. కార్డియాక్ అరెస్ట్ మరణాలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీపీఆర్ విధానంపై అందరూ అవగాహన పెంచుకోవాలని వైద్యారోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది. గుండెపోటుకు గురైన వ్యక్తికి సరైన వైద్యం అందేవరకు సీపీఆర్ చేయడం ద్వారా 90శాతం ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాకు చెందిన నలుగురు డాక్టర్లకు ఇటీవలే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్)పై పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. పీహెచ్‌సీల వారీగా జిల్లాలో సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యారోగ్య శాఖలో అవగాహన కల్పించడం పూర్తయిన తర్వాత పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

సీపీఆర్ ఇలా చేయాలి

- ఎవరికైనా అకస్మాత్తుగా గుండెపోటు వస్తే బాధితుడిని వెంటనే బల్లపరుపుగా ఉన్న స్థలంలో పడుకోబెట్టాలి.
- సీపీఆర్ చేయాలనుకునే వ్యక్తి రెండు చేతి వేళ్లను ఒకదానిలో ఒకటి జొప్పించి బాధితుడి ఛాతి మధ్యభాగంలో (గుండెపై కాదు) నొక్కాలి. క్రమంగా నొక్కుతూనే ఉండాలి.
- ఇలా నొక్కుతున్న సమయంలో మన చేతులు, మోచేతులు నిటారుగా ఉంచి ప్రెస్ చేయాలి.
- చేతులు స్టిఫ్‌గా ఉంచి బలంకొద్దీ నొక్కాలి. బాధితుడి ఛాతి కనీసం 5 సెంటీమీటర్ల మేర లోపలికి వెళ్లే విధంగా ప్రెస్ చేయాలి.
- ఎముకలు విరుగుతాయేమోననే భయం అవసరం లేదు.
- బాధితుడు స్పృహలోకి రావాలంటే నిమిషానికి వందసార్లు, అంతకంటే ఎక్కువ సార్లు ప్రెస్ చేయాలి.
- ఇలా ఒక నిమిషం వరకు నొక్కిన తర్వాత పల్స్ పరీక్షించాలి.
- నాడి కొట్టుకోకపోతే తిరిగి సీపీఆర్ కొనసాగించాలి.
- ఇలా 20 నుంచి 30 నిమిషాల వరకూ చేస్తూనే ఉండాలి.
- ఇలా ఆపకుండా సీపీఆర్ చేయడం ద్వారా గుండె తిరిగి పనిచేసే అవకాశాలు ఎక్కువ.
- కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తి పక్కన ఉన్నవాళ్లు అవగాహనతో ఈ ప్రక్రియ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- సీపీఆర్ చేస్తూనే 108 వాహనం లేదా అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి. ఇవి అందుబాటులో లేని ప్రాంతాల్లో అద్దె లేదా సొంత వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

ఐదు బృందాలు పనిచేస్తున్నాయి



గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా వైద్యారోగ్య శాఖను అలర్ట్ చేసింది. జిల్లాల వారీగా కొంతమంది వైద్యులను ఎంపిక చేసి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. వీరు జిల్లాలోని వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలకు సైతం సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తాం. ప్రస్తుతం జిల్లాలో ఐదు బృందాలు ఈ విధులు నిర్వహిస్తున్నాయి. గూగుల్, యూట్యూబ్‌లో చూసి కూడా సీపీఆర్‌పై అవగాహన పొందవచ్చు.

– డాక్టర్ పాల్వన్‌కుమార్, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

20న తైబజార్ బహిరంగ వేలం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు ఈ నెల 18న సాయంత్రం 4 గంటలలోపు మున్సిపల్ కార్యాలయం కొడంగల్ పేరున ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రూ.50వేల డీడీ, లేక మున్సిపల్ రశీదు ద్వారా రూ.50వేలు చెల్లించి తమ దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి తై బజార్ చార్జీలను వసూలు చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. సంబంధిత వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పలు పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం డీఈఓ రేణుకాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులను సెలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే మన ఊరు–మన బడి కార్యక్రమంలో నిర్మిస్తున్న పాఠశాలల భవనాలను పరిశీలించారు. భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం పాఠశాలల కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. తొలిమెట్టు కార్యక్రమం అమలుపై హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, సీఆర్‌పీ పట్నం నారాయణ తదితరులున్నారు.

ఇసుక డంప్‌లు సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

దౌల్తాబాద్: మండల పరిధిలోని సలీంపూర్‌లో మంగళవారం అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల పేరిట ఎలాంటి అనుమతి లేకున్నా.. ఇసుకను డంప్ చేసి అక్రమంగా విక్రయిస్తున్నారని తెలుసుకున్న తహసీల్దారు కృష్ణయ్య, ఆర్‌ఐ చంద్రశేఖర్.. సిబ్బందితో మంగళవారం గ్రామానికి చేరుకుని ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన మారుతి, వీరేశం, రమేశ్, బాల్‌రాజులు అక్రమంగా ఇసుకను డంప్ చేసినట్లు వారు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- దాహార్తితో అల్లాడుతున్న పశువులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పలుచోట్ల శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు

దోమ: వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతుండటంతో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం లక్షలాది నిధులు వెచ్చించి నీటి తొట్లను నిర్మించింది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఖాళీ తొట్లే దర్శనమిస్తున్నాయి. వేసవిలోనైనా వాటిలో నీరుపోసి మూగజీవాల దాహార్తి తీర్చాలన్న ధ్యాస లేకపోవడం గమనార్హం. దీనికి తోడు నిర్మించిన నీటి తొట్లు పలు చోట్ల పగుళ్లు రావడం, శిథిలావస్థకు చేరడంతో అవి నిరుపయోగంగా మారాయి. అధికారులలో పర్యవేక్షణ లోపం, నిర్వహణ బాధ్యత సక్రమంగా లేకపోవడంతోనే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మూగ జీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయని వాపోతున్నారు.

జిల్లాలో 617 తొట్లు..

జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల క్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద 617 నీటి తొట్లను నిర్మించారు. కొన్ని చోట్ల అసంపూర్తిగా వదిలేయడం.. పనులు నాసిరకంగా చేపట్టడంతో చాలా వరకు తొట్లు ఉపయోగానికి నోచుకోవడంలేదు. ఉన్న కొన్ని తొట్లలోనైనా నీటిని నింపాలన్న ఆలోచన అధికారులకు రాకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.



మోత్కుర్ గ్రామంలో నీరులేక నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

చాలా చోట్ల శిథిలావస్థకు..

దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 11,850 ఎద్దులు, 8,964 ఆవులు, 24,312 మేకలు ,14,163 గొర్రెలు ఉన్నాయి. వీటి దాహార్తి తీర్చేందుకు సుమారు మండలంలో 60 తొట్లను ఏర్పాటు చేశారని పశువైద్యాధికారి తెలిపారు. వాటిలో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. ఉన్న వాటిలో నీరు లేక మూగ జీవాలు అల్లాడుతున్నాయి. పశువుల సంరక్షణకు ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెడుతున్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామ పంచాయతీ బోర్ల ద్వారా తొట్లలో నీరు సరఫరా చేయాల్సి ఉండగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పలు చోట్ల నీటి తొట్ల వద్దకు వచ్చిన పశువులు, మేకలు, గొర్రెలు నీళ్లు లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నాయి. గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లో సైతం నీరు అడుగంటుతుండటంతో మూగ జీవాలకు నీటి కష్టాలు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో శిథిలావస్థకు చేరిన తొట్లను బాగు చేయించి మూగ జీవాలకు నీటిని అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఐనాపూర్‌లో నీటి తొట్టి దుస్థితి

నీటిని నింపండి



వేసవి దృష్ట్యా పశువుల కోసం ఏర్పాటు చేసిన తొట్లను బాగుచేయించి నీటిని నింపాలి. నీరు అందక మూగ జీవాలు అల్లాడుతున్నాయి. తొట్లలో నీరు లేకపోవడంతో పశువులను గ్రామ సమీపంలోని చెరువు దగ్గరికి తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. సంబంధిత అధికారులు గ్రామంలో ఉన్న తొట్లలో నీటిని నింపాలి.

– సీత్యాబాల్‌రాజు, రైతు, మోత్కుర్

పట్టించుకోని అధికారులు



గ్రామంలో ఉన్న నీటి తొట్టి శిథిలావస్థకు చేరింది. అధికారులు మరమ్మతులు చేయించడంలేదు. పలు మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పశువులను నీటిని తాగించేందుకు దూర ప్రాంతాంలో ఉన్న చెరువు దగ్గరకు తీసుకు వెళ్తాన్నాం. త్వరగా మరమ్మతులు చేపట్టి నీటితో నింపాలి.

– మేకల కృష్ణయ్య, రైతు, ఐనాపూర్

పశువుల దాహార్తి తీరుస్తాం



గ్రామాల్లో ఉన్న పశువుల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు గురైన తొట్లను బాగుచేయించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే పలు చోట్ల తొట్లలో నీరు నింపేందుకు చర్యలు చేపడుతున్నాం. గ్రామ పంచాయతీ ద్వారా నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్, పశువైద్యాధికారి, దోమ

క్షయ వ్యాధి రోగులు జాగ్రత్తలు పాటించాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్ యాదవ్

పెద్దేముల్: క్షయ వ్యాధి సోకిన రోగులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రవీందర్ యాదవ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కందనెల్లిలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఇతరులకు సోకకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సంబంధిత ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధి సోకిన రోగులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు,హెల్త్ సుప్రవైజర్ పుష్పలత, ల్యాబ్ సూపర్ వైజర్ అరుణ్‌కుమార్,ఏఎన్ఎం స్వప్న, ల్యాబ్ టెక్నిషియన్ సంతోష్‌కుమార్, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర అబ్జర్వర్ విశ్వనాథ్ గుప్తా

- ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి
- రాష్ట్ర అబ్జర్వర్ విశ్వనాథ్ గుప్తా

పరిగి: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర అబ్జర్వర్ విశ్వనాథ్ గుప్తా సూచించారు. పట్టణంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని ఆయ ఉన్నత పాఠశాలలను మంగళవారం స్టేట్ అబ్జర్వర్, స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు కలసి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల స్థితిగతులను తెలుసుకోవాలని వాటి అనుగుణంగానే విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా తరగతి గదిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. ప్రతి విద్యార్థిని దృష్టిలో ఉంచుకుని విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ సంతోష్ రాజ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, మండల విద్యాధికారి హరిశ్చందర్, ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మూడెకరాల భూమి ఏమాయె?

మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కావడంలేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు ఆయన పార్టీ నేతలతో కలిసి గ్రామంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుణ్ణి సీఎం చేస్తానన్న కేసీఆర్ హామీ ఏమైందన్నారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు 3 ఎకరాల భూమి, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వంటి బూటకపు హామీలిచ్చి సీఎం గద్దెనెక్కారన్నారు. ప్రజల్ని మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. ప్రత్యేక రాష్ట్రం సీఎం కేసీఆర్ వల్ల రాలేదని, సోనియాగాంధీ ప్రత్యేక చొరవ వల్ల వచ్చిందని గుర్తుచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో అమరులయ్యారని అన్నారు. నిరుద్యోగుల్లో ఆశలు కల్పించి ఉద్యోగాల నియామకాల కోసం నోటిఫికేషన్లు ఇచ్చినట్టే ఇచ్చి మరోవైపు కోర్టుల్లో కేసులు వేయించి నోటిఫికేషన్లు నిలిపివేయిస్తున్నారని మండిపడ్డారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ. 1,200 కోట్లు తీసుకవచ్చి అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక..

నాగసమందర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు మాజీమంత్రి ప్రసాద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, ధారూరు మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

అనంతగిరి: కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పకు చెందిన ఆయా పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కిశోర్, అంజనేయులు, శ్రీనివాస్, నవీన్‌చారి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

మల్లికార్జున ఖర్గేను కలిసిన టీఆర్ఆర్

పరిగి: డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో అఖిల భారతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ స్థితిగతులను ఖర్గే అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టత కోసం నిత్యం ప్రజల్లో ఉండి పనిచేయాలని సూచించారని రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని సూచించినట్లు చెప్పారన్నారు. హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంపైనా ఆరాతీసినట్లు తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండి వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించినట్లు టీఆర్ఆర్ తెలిపారు.



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

చిరుధాన్యాల సాగుపై అవగాహన



తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మహారాష్ట్ర మహిళా రైతులు

పరిశోధన స్థానాన్ని సందర్శించిన మహారాష్ట్ర మహిళా రైతులు

తాండూరు: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానాన్ని మహారాష్ట్రాలోని ఔరంగాబాద్ మహిళా రైతులు మంగళవారం సందర్శించారు. 40 మంది మహిళా రైతుల బృందం సందర్శించి కుసుమ, కంది, జొన్న పంటల సాగు పద్ధతులపై ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, సుధాకర్‌చౌరట్‌లు అవగాహన కల్పించారు. అలాగే కుసుమ, ఆర్గానిక్ కందిపప్పు తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌లో విక్రయించడం కంటే ఆహార ఉత్పత్తులుగా మార్చి అమ్మితే అధిక లాభాలు సాధిస్తారన్నారు. పంటలకు సమయానికి సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ ఔరంగాబాద్ జిల్లా అధికారి పల్లవీ గైక్వాడ్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో విజ్ఞానం పెంపు

మొయినాబాద్‌రూరల్: సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయవచ్చునని.. విజ్ఞానం పెంపొందించవచ్చునని యునైటెడ్ వే హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ మేనేజర్ గిరిజ అన్నారు. యునైటెడ్ వే హైదరాబాద్, ఆకృతి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ.. విద్యార్థులల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు ఆకృతి ప్రాజెక్టు వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలస్వామిరెడ్డి, నర్సింహ, సింహాచలం , ప్రాజెక్టు కమిటీ మేనేజర్ ముంతాజ్, జిల్లా మేనేజర్ అమర్‌నాథ్, ప్రాజెక్టు లీడ్ సభ్యులు సీమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.



అజీజ్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌కు ఉత్తమ బహుమతి అందజేస్తున్న ప్రాజెక్టు సభ్యులు

ఎగ్జామ్‌ప్యాడ్స్ పంపిణీ

ధారూరు: మండల పరిధిలోని కుక్కింద ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బోధి సంస్థ నిర్వాహకులు ఎగ్జామ్‌ప్యాడ్స్, జామెట్రీ బాక్సులను మంగళవారం పంపిణీ చేశారు. త్వరలో జరుగనున్న టెన్త్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని 55 మంది విద్యార్థులకు వీటిని అందించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేశం, కాసెట్టి శ్రీకాంత్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మైసమ్మ జాతర



ముస్తాబైన మైసమ్మ దేవాలయం

పెద్దేముల్: మండల పరిధిలోని మారేపల్లి శివారులో బుధవారం మైసమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు అమ్మ వారికి అభిషేకం, 11గంటలకు అన్నదానం సాయంత్రం 4గంటలకు బోనాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ చోరీ

కందుకూరు: వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విలువైన రాగి తీగలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన కందుకూరు పీఎస్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పులిమామిడి పరిధిలోని వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు రాత్రి కూలదోసి, అందులో విలువైన రాగి తీగలను దొంగిలించారు.

మూడు దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో మూడు దుకాణాల్లో దొంగతనం జరిగింది. పట్టణంలోని ఆలంపల్లి చౌరస్తా సమీపంలోని కైరా, లెనిన్ క్లాత్ స్టోర్‌తో పాటు బస్టాండ్ సమీపంలోని క్రాంప్టన్ డిస్ట్రిబ్యూషన్ దుకాణాలలో చోరికి పాల్పడ్డారు. దుకాణాల్లో ఉన్న కొంత నగదును దొంగలించారు. ఉదయం చూసే సరికి ఈ దుకాణాల సెట్టర్లు కొద్దిగా లేపి ఉండటం గమనించిన స్థానికులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. దుకాణాదారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ శీను తన సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల సహాయంతో ముగ్గురిని అనుమానితులను గుర్తించి దర్యాప్తు చేపడుతున్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలిరండి

పరిగి: భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టీయూ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ కోరారు. మంగళవారం పట్టణ కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచిర్యాలలో ఈనెల 25, 26, 27వ తేదీల్లో జరిగే మహాసభలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. సమ సమాజ స్థాపన ధ్యేయంగా కార్మిక సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శివ, శ్రీశైలం, మహేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు